01ATP06FF_01ATP06FF.qxd 07-04-2026 AM 12:38 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

మంగళవారం 07 ఏప్రిల్ 2026 పేజీలు : 04

సాంకేతికతను ఆర్థిక అభివృద్ధికి కాకుండా సమాజ శ్రేయస్సుకు ఉపయోగించండి

- రాష్ట్రగవర్నర్ అబ్దుల్ నజీర్
- ఘనంగా జెఎన్‌టియుఏ 15వ స్నాతకోత్సవం
- జెస్సీ థామస్‌కు గౌరవ డాక్టరేట్ ప్రధానం
- విద్యార్థులకు బంగారు పతాకాలు, డిగ్రీలు అందించిన గవర్నర్

జెస్సీ థామస్‌కు డాక్టరేట్‌ను అందిస్తున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర గవర్నర్‌ను సన్మానిస్తున్న విసి రంగ జనార్ధన్

అనంతపురం సిటీ, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

విద్యార్థులు సాంకేతికతను కేవలం ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయడానికే కాకుండా మానవ గరవాన్ని సమాజ శ్రేయస్సును పెంపొందించడానికి ఉపయోగించాలని రాష్ట్ర గవర్నర్ సూచించారు. జెఎన్‌టియుఏ 15వ స్నాతకోత్సవ వేడుకలు ఎన్టీఆర్ ఆడిటోరియంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. గౌరవ డాక్టరేట్‌ను మాజీ డైరెక్టర్ జనరల్ (ఏరోనాటికల్ సిస్టమ్స్) డా.జెస్సీ థామస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా తొలుత గవర్నర్ యూనివర్సిటీ ప్రాంగణానికి చేరుకోగా ఆయనకు విసి సుదర్శన్, రిజిస్ట్రార్ కృష్ణయ్యలతోపాటు డైరెక్టర్లు, అధికారులు స్వాగతం పలికారు. ఛాన్స్‌లర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ వేదికపైకి చేరుకున్నారు. ఈ సందర్భంగా విసి సుదర్శన్ రావు అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ.. జెఎన్‌టియుఏ యూనివర్సిటీ 15వ స్నాతకోత్సవం జరుపుకోవడం చారిత్రాత్మకం అన్నారు. స్నాతకోత్సవం అనేది పట్టభద్రతలకు ఒక వేదిక, క్రమశిక్షణ, రాబోవు రోజుల్లో అవకాశాలకు ముఖ ద్వారం లాంటి దన్నారు. విజయం అనేదది కఠోర శ్రమ, సన్నద్ధత, అంకిత భావం, ధైర్యం ఫలితం అన్నారు. ప్రధానమంత్రినరేంద్రమోదీ విద్య, పరిశోధన, డిజిటల్ సాధజకారత, సుస్థిర విద్యపై దృష్టి సారించారని అందులో

ఉద్యానానికి చిరునామాగా రాయలసీమ

- ❖ పనితీరు బాగాలేని అధికారులకు చురక
- ❖ యాడిక కాలువ, ప్రభుత్వ కళాశాల పూర్తికి హామీ
- ❖ గంజాయి ఆలోచన వస్తే రాష్ట్రం వదిలిపోవాల్సిందే
- ❖ అస్మిత్‌రెడ్డి ప్రసంగానికి చిరునవ్వులు చిందించిన సీఎం, మంత్రులు

ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

తాడిపత్రి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త

రాయలసీమలోని ప్రతి ఎకరాకు నీరందించి రాయలసీమను ఉద్యానానికి చిరునామాగా మారుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీనిచ్చారు. యాడికి మండల కేంద్రంలో సోమవారం జలధార కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఉదయం 11.20 గంటలకు సీఎం చంద్రబాబు నాయుడు యాడికిలోని కేజీబీవీ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకోగానే మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు,ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు, ఎంపీలు అంబికా లక్ష్మినారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు జేసీ అస్మిత్‌రెడ్డి, పరిటాల సునీత, పల్లె సింధూరరెడ్డి, బండారు శ్రావణి, ఎంఎస్ రాజు, ఏరాసు ప్రతాప్‌రెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, గుమ్మనూరు జయరామ్, మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు,లతో పాటు కమాండ్ ఏరియా డెవలెప్‌మెంట్ అథారిటీ స్పెషల్ కమిషనర్ ప్రశాంతి, జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీష్ తదితర జిల్లా అధికారులు స్వాగతం పలికారు. హెలిపాడ్ నుంచి ప్రజావేదికకు చేరుకోగానే అక్కడ ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాల్స్‌ను సీఎం సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అభిమానులు, కార్యకర్తలు, ప్రజల హర్షధ్వానాల మధ్య ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి స్వాగతం పలుకగా సీఎం వేదికపైకి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి స్థానికంగా ఉన్న సమస్యలను సభాముఖంగా సీఎం దృష్టికి తీసుకొని పోయారు. తాను అడిగినప్పుడల్లా తాడిపత్రి ప్రాంతానికి సాగునీరందించిన సీఎంను అపర భగీరథునిగా ఎమ్మెల్యే అభివర్ణించారు. యాడికి కాలువ నిర్మాణం పూర్తి చేసి సాగునీటిని కేటాయిస్తే తమ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని, అవసరమని ఎంపీ అంబికా లక్ష్మినారాయణ అన్నారు. ఈ సందర్భంగా వేదికపై ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చిన గుర్రం రామాంజినేయులు, గూలిపాలెం శివ నరసింహులు, సాగునీటి సంఘాల జిల్లా, నియోజకవర్గ అధ్యక్షులు కొర్రపాటి శేఖర్, కొట్టం నాగేశ్వర్‌లు సీఎం పక్కన ఆసీనులయ్యారు. తాము ఈ వేదికపై ఆసీనులు అవడానికి ప్రధాన కారణం సీఎం, ఎమ్మెల్యేలేనని, సాగునీరు సకాలంలో అందిస్తే మరింత దిగుబడులు సాధిస్తామని గుర్రం రామాంజినేయులు తెలిపాడు. అనంతరం సీఎం ప్రసంగం కొనసాగింది.

:ఉద్యానానికి చిరునామా రాయలసీమ

ప్రస్తుతం రాయలసీమ ఉద్యానానికి చిరునామాగా మారిందని, పండ్ల కూరగాయాలు పండించడంలో దేశంలో అగ్రస్థానం ఆంధ్రప్రదేశ్‌ది అయితే..అందులో మొదటి స్థానం రాయలసీమదని సీఎం అన్నారు. రాబోయే ఆరేడు సంవత్సరాల్లో సుమారు రూ. 30 వేల కోట్లు ఖర్చుపెట్టి, మరో రూ. 70 వేల కోట్లు ప్రయివేటు పెట్టుబడులు తెచ్చి రాయలసీమను ప్రపంచానికి హార్టికల్చర్ హబ్‌గా పరిచయం చేస్తామని ఆయన అన్నారు. 21 నెలల్లో ఎన్నో మార్పులు తీసుకొచ్చామని, రాష్ట్రంలోని 38,628 చెరువుల్లో 20 వేల చెరువులను పూర్తిగా నీటితో నింపామని, గతేడాది 10.62 మీటర్ల లోతులో ఉన్న నీటిని ఇప్పటికి 8.7 మీటర్లకు తగ్గించామని, భూమిలో నీటి శాతం పెరిగిందని ఆయన అన్నారు. అనంతపురం జిల్లాలో 2024 ఏప్రెల్‌లో 13.36 మీటర్లలో నీరుంటే 11.25 మీటర్ల లోతులో భూగర్భ జలాలు అందేలా చేశామని, ఆ బాధ్యత ప్రభుత్వం తీసుకుంటే ప్రజలు కూడా సహకరించాలని ఆయన తెలిపారు. నేడు నేను నీటి భద్రత కోసం ఇక్కడికి వచ్చానని, నీటి ఎద్దడి లేకుండా చేయడానికి నేను మీకు తోడుగా ఉంటానని, సమిష్టిగా కలసి జల సంరక్షణను ఓ ఉద్యమంలా చేపడదామని ఆయన పిలుపునిచ్చారు. బ్యాంకుల్లో డబ్బు దాచినట్లే భూగర్భాన్ని జల బ్యాంకుగా మారుద్దామని, పరిగెత్తే నీటికి

స్థానిక సమస్యలను సీఎంకు వినిపిస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

ఇంకేలాగానూ, ఇంకిన నీటిని సద్వినియోగం చేసుకునే బాధ్యత ప్రజలదని ఆయన అన్నారు. నదుల అనుసంధానంతో రాష్ట్రానికి నీటి భద్రత కల్పిస్తామని సీఎం చెప్పారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అడిగినట్లు యాడికిలో ప్రభుత్వ జూనియర్ కళశాల మంజూరు, యాడికి కాలువ పూర్తికి చర్యలు తీసుకుంటామని సీఎం హామీనిచ్చారు.

:పనితీరు బాగాలేని అధికారులకు చురక

పనితీరు బాగాలేని విద్యుత్తు, పంచాయతీరాజ్, విద్య, శిశు సంక్షేమం, రోడ్లు భవనాల శాఖ వంటి జిల్లా అధికారులకు సీఎం చురక వేశారు. పనితీరు మెరుగు పరచుకోవాలని, త్వరలోనే తాను ఆకస్మిక తనిఖీలు చేపడతానని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఈ శాఖల పనితీరు రాష్ట్ర స్థాయిలో కంటే, నియోజకవర్గ స్థాయిలో కంటే జిల్లా స్థాయిలో తక్కువ శాతం ఉందని సీఎం వివరాలతో వివరించారు.

రోడ్లు భవనాల పనితీరు, పంచాయతీ రాజ్ పనితీరు మరీ దారుణంగా ఉందని ఆ శాఖల అధికారులను సీఎం వివరణ కోరారు.కళశాల విద్య 62 శాతంతో చాలా వెనుకబడి ఉందని, మనందరం ప్రజా సేవకులమనే విషయం మరిచిపోవద్దని ఆర్‌డీకి సీఎం సూచించారు.

ఉచిత ఇసుక విషయంలో దందా జరిగితే నీ ఉద్యోగం ఉద్యానపంటల సాగుకు మరింత అనుకూలత ఏర్పడుతుందని ఎమ్మెల్యే సీఎంను కోరారు. చాలా కాలంగా యువతకు అవసరమైన ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం వేచిచూస్తున్నామని, కళాశాల కేటాయింపుపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకొనిపోయారు. ఉద్యాన పంటల సాగుతో ముందుకు పోతున్న అనంత రైతులకు ప్రభుత్వ ప్రోత్సహకాలు ఎంతో

సిఎం చంద్రబాబు యాడికి సభ గ్రాండ్ సక్సెస్

- ప్రజల ముందే ప్రగతి నివేదికలపై సీఎం చంద్రబాబు ప్రజెంటేషన్
- సభలో అధికారులకు ముచ్చెమటలు - అమరావతి చట్టబద్ధులపై ప్రజల నుంచి మంచి స్పందన
- ఇసుక, కరెంటుపై సీఎం ఎదుటే అసంతృప్తి - సీరియస్ అయిన సీఎం చంద్రబాబు

అనంతపురం, ఏప్రిల్ 6, (ప్రభాతవార్త బ్యూరో)

అనంతపురం జిల్లా తాడపత్రి శాసనసభ నియోజకవర్గం యాడికి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ మైదానంలో జలధారనీటి భద్రతసాగునీటి సంఘాల బాధ్యత అనే అంశంపై సోమవారం జరిగిన సీఎం చంద్రబాబు నాయుడు సభ గ్రాండ్ సక్సెస్ అయింది. సభలో ఉన్న రైతులు, ఇతర వర్గాల ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. సభలో ప్రజల ముందే నియోజకవర్గ, జిల్లాస్థాయి అధికారుల సమక్షంలో రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు ప్రగతి నివేదికలపై సమీక్ష జరపడం ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ ప్రక్రియ అధికారుల గుండెల్లో బెంబేలు పుట్టించింది. ప్రగతి నివేదికలు సరిగా లేని వారిపై మెమో జారీ చేయాలని, సస్పెండ్ చేయాలని సీఎం చంద్రబాబు ఇలాంటి ఆదేశాలు లాంటి ఆదేశాలు సభలో ఇవ్వకపోయినప్పటికీ తనదైన శైలిలో చురకల అంటించారు. ఐ వి ఆర్ ఎస్ సర్వే ప్రకారం వివిధ శాఖల పనితీరు రాష్ట్రస్థాయిలోను, జిల్లాస్థాయిలోను, నియోజకవర్గస్థాయిలోనూ ఎలా ఉందో తాను తెలుసుకున్న వివరాలను సభలో సీఎం చంద్రబాబు ప్రజల ముందు ఉంచుతూ వచ్చారు. ఒక్కొక్క శాఖ తరపున వివరిస్తూ సంబంధిత అధికారిని వేదిక వద్దకు పిలిపించి ప్రజల ముందే సీఎం మాట్లాడడం విశేషం. బాగా పనిచేసిన అధికారులను అభినందిస్తూ ప్రగతి నివేదికలు తక్కువగా ఉన్న అధికారులను సరి చేసుకోవాలని సీఎం హెచ్చరించారు. ఒకానొక సమయంలో కొందరు అధికారులు రాకపోవడంతో వాళ్ళు ఎందుకు రాలేదని జిల్లా కలెక్టర్ ఆనంద్ ను ప్రశ్నిస్తూ వివరణ అడగడం కలెక్టర్ కూడా తగిన సమాధానం ఇవ్వడం జరిగింది. తాను 2014 సిబిఎన్ కాదని, 1995 సిబిఎన్ అంటూ సీఎం అధికారులకు హెచ్చరిక చేస్తూ ప్రజా సమస్యల విషయంలో గట్టిగా పని చేయాలని, అవసరమైతే ఆకస్మిక తనిఖీలు కూడా వస్తానని సీఎం చంద్రబాబు హెచ్చరికలు జారీ చేశారు. ప్రగతి నివేదికలు సీఎం చంద్రబాబు నాయుడు చదివే సమయంలో విద్యుత్ సరఫరా, ఇసుక సరఫరా విషయంలో ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తం అయ్యింది. విద్యుత్ సరఫరా ను 24 గంటలు అందిస్తున్నామని , రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదని విద్యుత్ ట్రాన్స్కో అధికారి సహజ ధోరణిలో సభలో సీఎం సమక్షంలో చెప్పేందుకు ప్రయత్నించాడు. విద్యుత్ సరఫరా సరిగా లేదని, అధికారులు చెప్పింది కరెక్ట్ కాదని సభలో ఉన్న పలువురు రైతులు చేతులు ఊపుతూ అసంతృప్తి వ్యక్తం చేయడంతో సీఎం సీరియస్ అయి రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇసుక సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను సీఎం వివరిస్తూ ఉచితంగా ఇసుకను తీసుకెళ్లేందుకు ఎవరైనా అడ్డుకుంటున్నారా అని సీఎం సభలో ప్రజలను ప్రశ్నించారు. ఉచితంగా తీసుకెళ్లని ఇవ్వడం లేదని, అడ్డుకుంటున్నారని సభలో కొందరు ప్రజలు లేచి చెప్పడంతో సభలోనే సీఎం సంబంధిత అధికారులపై సీరియస్ అయ్యారు. రాబోయే రోజుల్లో ఎక్కడైనా ఇలాంటివి జరిగితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సమావేశానికి హాజరు గాని అధికారుల గురించి తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. ఈ విధంగా వివిధ శాఖలకు చెందిన అధికారులను వేదికపైకి పిలిపించి వివరణ అడిగారు. పనితీరును మెరుగు పర్చుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులకు పూర్తిగా సహకరిస్తామని... అధికారులు, ఉద్యోగులు కూడా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని సీఎం కోరారు. బాగా పని చేసిన అధికారును అభినందించాలంటూ ప్రజలతోనే సభలో చప్పట్లు కొట్టించారు. ఉద్యోగుల పనితీరు ఆధారంగా సూపర్ అచీవర్స్.. అచీవర్స్.. పెర్ఫార్మర్స్.. లెర్నర్స్ గా విభజిస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. కొందరు అధికారులు గైర్హాజరు కావడంతో...ఇకపై తాను వచ్చే ప్రతీ సభకు జిల్లా అధికార యంత్రాంగం మొత్తం హాజరవ్వాలని సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జలధార కార్యక్రమంలో ప్రజావేదిక సభకు వచ్చేముందు ప్రజలు జై అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని అమరావతికి పార్లమెంట్ చట్టబద్ధత కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. స్వయంగా అమరావతి లోగో పట్టుకుని సభకు జేసీ ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. యాడికిలో సీఎం హెలిక్యాప్టర్ దిగాక అమరావతి బ్యాడ్జిని అందించారు. సభలో రాజధానికి చట్టబద్ధతపై హర్షం వ్యక్తం చేస్తూ ప్లకార్డులు, జెండాలు ప్రదర్శించారు.. సభ అనంతరం పార్లమెంటులో అమరావతికి చట్టబద్ధత ఆమోదానికి గుర్తుగా సీఎంకు అమరావతి జ్ఞాపికను జేసీ పవన్ రెడ్డి అందించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్పు కాల్వ శ్రీనివాసులు,స్థానిక ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్ రెడ్డి, మాజీ మంత్రి జేసి దివాకర్ రెడ్డి, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బికే పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, సురేంద్రబాబు, ఎమ్మెస్ రాజు,దగ్గుబాటి ప్రసాద్, గుమ్మనూరు జయరాం, బండారు శ్రావణి పల్లె సింధూర రెడ్డి, ఏడిసిసి బ్యాంక్ అధ్యక్షులు ముంతిమడుగు కేశవరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు నాగరాజు, జిల్లా ప్రజాప్రతినిధులు, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రసంగానికి ముందు ప్రజావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. సభ ముగిసిన తర్వాత పెండేకల్లు రిజర్వాయర్ వద్దకు సీఎం వెళ్లారు. అక్కడ రైతులతో ముచ్చటించారు. వేములపాడు వద్ద తాడవత్రి నియోజకవర్గ టిడిపి కార్యకర్తలు, నాయకులతో సీఎం చంద్రబాబు ముచ్చటించారు. సీఎం పర్యటన సక్సెస్ కావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

అశ్వవాహనంపై దర్శనమిచ్చిన చౌడేశ్వరిదేవి

అమడగూరు,
ఏప్రిల్ 6 ప్రభాతవార్త

అశ్వవాహనంపై చౌడేశ్వరిదేవిని ఊరేగిస్తున్న దృశ్యం

అమడుగూరులో వెలసిన చౌడేశ్వరిదేవి జ్యోతి తేరు ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఏ.రెడ్డి వారిపల్లి గ్రామస్తులు పి.అశ్వత్తమ్మ, పి.లక్ష్మణ్ నారాయణరెడ్డి, కోలార్, పి.శ్రీరామ్‌రెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఊరేగింపులో అమ్మవారికి స్వాగతం పలుకుతూ కోలాటాలు చెక్కభజనలు వివిధ నాట్య కళాకారులు భక్తులను ఆకట్టుకున్నారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మ వారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పొట్టా పురుషోత్తమరెడ్డి, మాజీ జెడ్‌పిటిసి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచు షబ్బీర్, ప్రభాకర్‌రెడ్డి, రాజు, భాస్కర్‌రెడ్డి, పెద్దక్క భాస్కర్‌రెడ్డి, దేగ కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, కాసుల వెంకటరమణ, సప్లయర్ రమేష్, రెడ్డప్ప, అంగడి అమర్నాథ, వల్లీపి కిష్టప్ప, వార్త రమణ. మురళిస్వామి, రాజారెడ్డి, రామచంద్ర, ఐ.రాము, ఐ.లక్ష్మి నారాయణ, దొడ్డం నరసింహుమూర్తి, అమడుగూరు, గుండువారిపల్లి, చీకరేవులపల్లి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధం - రూ.లక్ష నష్టం

పుట్లూరు,
ఏప్రిల్ 6 ప్రభాతవార్త

దగ్ధమవుతున్న గడ్డివామి

పుట్లూరు మండలం శనగలగూడూరు గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు సంభవించిన అగ్నిప్రమాదంలో కె.వెంకటేష్‌రెడ్డి, మంగళ సుబ్బరాయుడుకు చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఇందులో వాటి పక్కనే వున్న మరొక గడ్డివాము పాక్షికంగా దగ్ధమైంది. అకస్మాత్తుగా మంటలు వ్యాపించడంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అయితే ఫైరింజన్ యాడికిలో సోమవారం జరిగిన సిఎం ప్రోగ్రాం వద్దకు వెళ్ళడంతో చేసేదేమిలేక గ్రామస్తులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ ప్రమాదంలో దాదాపు లక్ష రూపాయల వరకు నష్టం సంభవించినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

రికార్డు అసిస్టెంట్ సేవాభావం
- విద్యార్థులకు కొనసాగుతున్న మజ్జిగ పంపిణీ

పుట్లూరు,
ఏప్రిల్ 6 ప్రభాతవార్త

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రస్తుతం వేసవికాలం కావడంతో విద్యార్థులకు తనవంతు సేవ చేయాలన్న ఉద్దేశ్యంతో కడవకల్లు గ్రామంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.వెంకటేష్ సొంత ఖర్చుతో విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేస్తూ సేవాభావాన్ని చాటుకుంటున్నారు. ఇందులో భాగంగా మండల ంలోని కడవకల్లు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన సేవాభావాన్ని పలువురు ప్రశంసిస్తు న్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవం

ఓబుళదేవరచెరువు,
ఏప్రిల్ 6, ప్రభాతవార్త :

జెండా వందనం చేస్తున్న బిజెపి నాయకులు

భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కన్వీనర్ ఇడగుట్ట వీరాంజినయులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని బస్ షెల్టర్ వద్ద జెండా ఏగురువేశారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పివీఎన్ మాధవ్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు జిఎం శేఖర్ ఆధ్వర్యంలో మన ఊరు–మన జెండా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసి మోర్చా ఉపాధ్యక్షుడు హరిక్రిష్ణ, జిల్లా యువ మోర్చా జనరల్ సెక్రటరీ నరేష్‌బాబు, సీనియర్ నాయకులు రంగారెడ్డి, ఆశ్వర్థప్ప, నీలకంఠారెడ్డి, శివారెడ్డి, నాగప్ప, మహదేవరెడ్డి, మహేష్‌బాబు, అశ్రఫ్, సతీష్, రవీంద్రలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఓటమిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది..!

-నాడు మద్య నిషేదానికి కృషి చేస్తే నేడు విచ్చల విడిగా మద్యం అమ్మకాలు -జగన్మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ, సంస్కరణలు చాలా గొప్పవి - దాదాపు రెండేళ్ల కాలంలోనే కూటమి ప్రభుత్వం 3.4 లక్షల కోట్ల అప్పు చేసింది- ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.3వేల కోట్ల బకాయిలతో సేవలకు అంతరాయం -సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి


: హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఉరవకొండ, ఏప్రిల్ 6 ప్రభాతవార్త
గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమిపై నేడు దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని మేధావి అయినటువంటి పరకాల ప్రభాకర్ తదితరులు పోలింగ్ జరిగిన తీరు, అనూహ్యంగా పెరిగిన పోలింగ్ శాతం గూర్చి లేవనెత్తిన ప్రశ్నలకు నేడు ఎవరూ సమాధానం చెప్పలేకపోతున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్ళుగా ఐదేళ్ల పాలన సాగించి అనేక సంస్కరణలు తీసుకొచ్చిన వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పార్టీ ఓటమి పాలవ్వడం ఏంటని అందరిలోనూ ఎన్నో ప్రశ్నలు ఉన్నాయన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ కారణంగా ప్రజల ఇంటివద్దకే ప్రభుత్వ సేవలన్నీ అందుబాటులోకి వచ్చాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్లలో 3.20 లక్షల కోట్లు అప్పుచేసి 2.70 లక్షల కోట్ల రూపాయలను వివిధ సంక్షేమ పథకాల కింద ప్రజలకు నేరుగా అందించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దాదాపు రెండేళ్లలోనే 3.40 లక్షల కోట్లు అప్పు చేసిందని ఆ డబ్బును ఎక్కడ ఖర్చుపెట్టిందో తెలియడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో కొన్నింటిని అరకొరగా అమలు చేయడం మినహా చేసింది శూన్యమన్నారు. ఆరోగ్యశ్రీను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని నెట్‌వర్క్ ఆసుపత్రులకు 3వేల కోట్ల బకాయిలు చెల్లించకపోవడంతో నేడు సేవలు నిలిచిపోయాయన్నారు. జగన్మోహన్‌రెడ్డి దశల వారి మధ్య నిషేదం అమలుకు చర్యలు తీసుకుంటే నేడు రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని ప్రజారోగ్యంను ప్రభుత్వం గాలికొదిలేసిందని ఎక్కడ చూసినా మద్యం బెల్టుషాపులు, అక్రమ మద్యంతో అనేకమంది అనారోగ్యాలపాలై అకాల మరణాలు పొందుతున్నారన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీలు నరసింహులు, కరణం పుష్పావతి, దేవిబాయి, నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, నాయకులు ఎం.అశోక్‌కుమార్, సి.పి.వీరన్న, కె.వి.రమణ, ఈడిగ ప్రసాద్, జి.ఎర్రిస్వామిరెడ్డి, ఏ.సి.ఎర్రిస్వామి, ఎం.బసవరాజు, బి.యోగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద అన్నదానం

పుట్లూరు,
ఏప్రిల్ 6 ప్రభాతవార్త

భోజనం వడ్డిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 129 సోమ వారాలుగా దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయం అభివృద్ధి చేయడానికి గాను ప్రతి సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతోందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆర్.ఓబులేసు, భారతీయ జనతాపార్టీ అసెంబ్లీ ఎక్స్ కో కన్వీనర్ కుందూ శ్రీనివాసులరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

బుగ్గరామలింగేశ్వరునికి పంచామృతాభిషేకాలు

తాడిపత్రిటౌన్,
ఏప్రిల్ 6 ప్రభాతవార్త

బుగ్గరామలింగేశ్వర స్వామిని అలంకరించిన దృశ్యం

తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన బుగ్గరామలింగేశ్వరస్వామికి సోమవారం అర్చకులు ఎం.యోగానందకుమార్‌శర్మ, రామకృష్ణ శర్మలు పంచామృతాభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మ వారిని అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మలు ప్రత్యేకంగా అలంకరించి కుంకు మార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు అర్చకులు శంకరయ్య శర్మ, గిరిశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్‌నాయుడు, కమిటీ సభ్యులు చవ్వా రంగనాథరెడ్డి, సిబ్బంది విజయ్, తదితరులు పాల్గొన్నారు.

బుగ్గరామలింగేశ్వరున్ని దర్శించుకున్న సూర్యభగవానుడు

తాడిపత్రిఅర్బన్,
ఏప్రిల్ 6 ప్రభాతవార్త

శివునిపై సూర్య కిరణాలు పడిన దృశ్యం

తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం శివునిపై సూర్యభగవానుడు తన కిరణాలు ప్రసరింపచేసి స్వామివారిని దర్శించుకున్నారు. విషయం తెలుసుకున్న భక్తులు అధిక సంఖ్యలో ఈ దృశ్యాన్ని చూసేందుకు ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయం భక్తులతో సందడిగా మారింది. ఈ అరుదైన దృశ్యం భక్తులకు కనువిందు చేసింది. స్వామివారికి ఆలయ అర్చకులు యోగానందకుమార్‌శర్మ, రామకృష్ణశర్మ, శంకరయ్యశర్మ, గిరిశర్మ, మహేష్‌శర్మ, రవిశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్‌నాయుడు, కమిటీ సభ్యులు చవ్వా రంగనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు టీబీ సోకే ప్రమాదం
- డాక్టర్ భానుప్రకాష్

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :
దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు టీబీ వ్యాధి సోకే ప్రమాదం ఉందని డాక్టర్ల సూచనలు పాటిస్తే ప్రమాదమేమి లేదని డాక్టర్ భానుప్రకాష్ తెలియచేశారు. సోమవారం మండలంలోని వెంకటాపురం సచివాలయం నల్లగుట్లపల్లిలో పుట్టపర్తి టీబి యూనిట్ ఆధ్వర్యంలో టీబీ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. టీబీ వ్యాధి అధికంగా దీర్ఘకాలిక రోగులకు వచ్చే ప్రమాదం ఉందని, మంచి పౌష్టికాహారం తీసుకుని వైద్యులు సూచనల మేరకు మందులు వాడితే తగ్గే అవకాశాలు ఉన్నాయని ఆర్బీఆర్‌ఎస్‌కే మరియు టీబి ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్ తెలియచేశారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారికి ప్రాథ మిక ఆరోగ్యకేంద్రంలో పలు రకాలు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నామని డాక్టర్ భానుప్రకాష్ తెలిపారు. వైద్యశిబిరానికి వచ్చిన టీబీ వ్యాధిగ్రస్తులకు దాతల సహకారంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కమల్‌రోహిత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బిజెపి 47వ ఆవిర్భావ దినోత్సవం

నంబులపూలకుంట,
ఏప్రిల్ 6 ప్రభాతవార్త

ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్‌పి కుంట మండలం, మొండెంవారి పల్లె గ్రామంలో బిజెపి మోర్చా మండల అధ్యక్షులు నాగార్జున నాయుడు, మైనారిటీ మోర్చా మాజీ మండల అధ్యక్షులు షేక్ ఇంతియాజ్ ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, మల్లికార్జున, చలపతి, ఈశ్వరయ్య, సూరి, వంశీ, పార్వతమ్మ, అన్నమ్మ, రామాంజినేయులు, వెంకటరమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఫోక్స్ కేసులో నిందితుడు అరెస్ట్..

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

నింధితున్ని చూపుతున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసి మాయ మాటలు చెప్పి వివాహం చేసుకున్న కేసులో ఆటో డ్రైవర్ గుణ అనే యువకుడిని చెన్నేకొత్తపల్లి పోలీసులు అరెస్టు చేసి సోమవారం ధర్మవరం కోర్టులో హాజరు పరిచారు. మేడాపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గుణ మార్చి 31న మేడాపురం గ్రామానికి చెందిన మైనర్ బాలికను కిడ్నాప్ చేసి మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకున్నాడు. దీంతోబాలిక తల్లిదండ్రులు సికె పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు నిందితుడు గుణపై పోక్స్ కేసు నమోదు చేసి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు నిందితుడు గుణ పుట్టపర్తిలో ఆటో నడుపుకుంటూ ఉన్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని విచారించి సోమవారం ధర్మవరం కోర్టులో హాజరు పరిచారు.

ఘనంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

బిజెపి జెండా ఆవిష్కరించిన నాయకులు

తాడిపత్రి పట్టణంలో సోమవారం బిజెపి సీనియర్ నాయకులు అంకాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జెండా ఎగురవేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం నాయకులు అంకాల్‌రెడ్డి మాట్లాడుతూ 1980లో అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలో పార్టీ ఆవిర్భావం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్రమోడీ అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా చూడాలన్నారు. భారతదేశం ప్రపంచ దేశాల్లో 4వ ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశంగా నిలిపారన్నారు. దేశంలో దాదాపు 18 రాష్ట్రాల్లో బిజెపి అధికారంలో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పార్టీని భూత్ స్థాయి నుండి బలోపేతం చేసి రాష్ట్రంలో పార్టీ అధికారం వచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మైదుకూరు ఆంజనేయులు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ వై. రామాంజనేయులు, రాయలసీమ బిల్డింగ్ ఇన్‌చార్జ్ అంబటి రామకృష్ణారెడ్డి, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు సింగిరి లక్ష్మినారాయణ, అర్బన్, రూరల్ అధ్యక్షులు చెన్నా రంగనాయకులు, శేషానందరెడ్డి, సీనియర్ నాయకులు కరుణాకర్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శులు జూటూరు ఓబిరెడ్డి, ఎం.వి. సుబ్బయ్య, ఉపాధ్యక్షులు, ఖాజాభాను, ఆనంద్‌రెడ్డి, ఆనందరావు, దుద్దుగాళ్ల వంశీ, కార్యదర్శులు నాగేశ్వరరావు, ఈశ్వర్‌నారాయణ, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు సి.లక్ష్మీ, మహిళా మోర్చా టౌన్ అధ్యక్షురాలు అమరావతి, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సింగిరి రవితేజ, పట్టణ యువ మోర్చా అధ్యక్షుడు మధు, జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరభద్ర, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి సి. నాగరాజు, కార్యవర్గ సభ్యుడు యు.కృష్ణమోహన్‌రాజు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

మాట్లాడుతున్న నారాయణస్వామి

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, జిరాంజీ చట్టాన్ని రద్దు చేయాలని నిరసిస్తూ నార్పల మండలం బండ్లపల్లిలో సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.నారాయణస్వామి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని రజక కళ్యాణమండపంలో సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ అధ్యక్షతన సిపిఐ పార్టీ జనరల్ బాడీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి. నారాయణస్వామి, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి.రంగయ్య, రైతు సంఘం నాయకుడు వెంకటరాముడుయాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి. నారాయణస్వామి మాట్లాడుతూ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తెచ్చారన్నారు. అయితే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గిస్తూ నిర్వీర్యం చేస్తూ వచ్చిందన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, జిరాంజీ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈనెల 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు అనంతపురం నుండి బండ్ల పల్లి వరకు పాదయాత్ర, అనంతరం 12వ తేదీ బండ్ల పల్లిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. కావున సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు రైతులు రైతు కూలీలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నాగరంగయ్య, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి శ్రీరాములు, రజక వృత్తిదారుల సమైక సంఘం కార్యదర్శి సాలవేముల సూరి, ఏఐటియుసి నాయకుడు వెంకటరాముడు, శ్రీనివాసులుయాదవ్, రంగస్వామియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర పోస్టర్లను విడుదల చేసిన సిపిఐ నాయకులు

పుట్లూరు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

పాదయాత్ర పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఐ నాయకులు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కోరుతూ ఈనెల 10 నుండి 12 వరకు తలపెట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి పోస్టర్లను సోమవారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య మాట్లాడుతూ అనంతపురం నుండి బండ్లపల్లి వరకు 2 రోజులపాటు పాదయాత్ర ఉంటుందన్నారు. 12వతేదీన బండ్లపల్లిలో బహిరంగసభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర నాయకులు కె.రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాఫర్, తదితరులు హాజరవుతారన్నారు. కావున వ్యవసాయ కూలీలు, పేదలు, దళితులు, చేతి వృత్తిదారులు, రైతులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి: రాజు, డిహెచ్ పి ఎస్ మండల అధ్యక్షులు పెద్దన్న, చేతి వృత్తి దారుల సమాఖ్య మండల అధ్యక్షులు ఓబుళపతి, ఆర్.ఓ బుళరాజు, దేవుడు, నారాయణ, పుట్లూరు నారాయణ, సూరి, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ కాలనీలో నీటి ఎద్దడి
- ఏడాది దాటినా బోరుకు అందని విద్యుత్ కనెక్షన్ - వినతిపత్రం అందజేసిన కాలనీవాసులు

లేపాక్షి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

వినతిపత్రం అందచేస్తున్న సిపిఐ నాయకులు

మండల కేంద్రమైన లేపాక్షిలోని నీలం రాజశేఖర్‌రెడ్డినగర్‌లో నీటి సమస్య జటిలమవుతోంది. ఎండలు ముదురుతున్నా అధికారులు నీటి సరఫరాపై దృష్టి సారించకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సోమవారం సిపిఐ నాయకులు, కాలనీవాసులు కలిసి మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ కులాయప్పకు వినతిపత్రం అందచేశారు. నీలం రాజశేఖర్‌రెడ్డినగర్‌లో గత ఏడాది ఒక బోరు బావిని తవ్వించారు. అందులో పుష్కలంగా నీరు పడడంతో మోటార్‌ను బిగించి, పైపులైన్‌ను కూడా ఏర్పాటు చేశారని. అయితే పనులు పూర్తయి ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ బోరు అందుబాటులోకి వస్తే నీలం రాజశేఖర్‌రెడ్డినగర్‌తో పాటు పక్కనే ఉన్న ఇందిరమ్మకాలనీ, జగనన్న లేఅవుట్ వాసుల దాహార్తి కూడా తీరుతుందని, ఇప్పటికే జగనన్న లేఅవుట్ వరకు పైపులైన్ సిద్ధంగా ఉందని వారు ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లారు. అన్ని సౌకర్యాలు ఉన్నా కేవలం బోరు బావికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడం వల్ల కాలనీవాసులు చుక్క నీటి కోసం మైళ్ల దూరం వెళ్లాల్సి వస్తోందని సిపిఐ మండల కార్యదర్శి గౌతమ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా అధికారులు వెంటనే స్పందించి బోరుకు కనెక్షన్ ఇచ్చి నీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాలనీ వాసులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శివప్ప, నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, ఏఐటియుసి మండల కార్యదర్శి గోవిందు, మహిళలు కాంతమ్మ, రోజా, మమత, లక్ష్మీ, మంజుల, గుల్జార్, దాలప్ప, బాబాజాన్, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిలో ఘనంగా భాజపా ఆవిర్భావ దినోత్సవం

లేపాక్షి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

వేడుకల్లో పాల్గొన్న బిజెపి నాయకులు

మండల కేంద్రమైన లేపాక్షిలో భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బిజెపి మండల అధ్యక్షుడు నరసింహామూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా స్థానిక బస్టాండ్ ఆవరణలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ దేశ సమగ్రత, అభివృద్ధి లక్ష్యంగా భాజపా పనిచేస్తోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయని వివరించారు. కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేసి పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాజపా సీనియర్ నాయకులు ఆది మూర్తి, విశ్వనాథ్, మండల ప్రధాన కార్యదర్శి సిరివరం నరసింహామూర్తి, ఉపాధ్యక్షులు చంద్ర శేఖర్, ఆనందప్ప, సీనియర్ నాయకులు బద్రి, నీరుగంటి అంజి, దత్తు, గోవిందరెడ్డి, నాగేంద్ర, రాజు, అవినాష్‌రెడ్డి, ఈశ్వర్ ప్రసాద్, గంగప్ప, కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య ఉంటే 94911 20803కు ఫోన్ చేస్తే పరిష్కరిస్తాం..!

-మండల సమావేశంలో వెల్లడించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఐజయ్య-రాత్రిళ్లు 1,2 గంటలకు నీటి సరఫరా చేస్తున్నారన్న ఎంపీపీ -వివిధ సమస్యలపై ప్లకార్డు ప్రదర్శించిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ -సజావుగా కొనసాగిన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్


వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఐజయ్య


ప్లకార్డును ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ వన్నూరుసాబ్

ఉరవకొండ, ఏప్రిల్ 6 ప్రభాతవార్త
ఉరవకొండ పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా నీటి సమస్య ఉంటే మొబైల్ నంబర్ 94911 20803కు కార్యాలయ పనివేళల్లో ఫోన్ చేస్తే ఆ సమస్యను పరిష్కరించడం జరుగుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఐజయ్య తెలిపారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ ఎం.నరసింహులు అధ్యక్షతన ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్ ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరుగగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ నరిశేటి విజయభాస్కర్, పీఏసీఎస్ ఛైర్మెన్ ప్యారం కేశవానంద హాజరయ్యారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరాపై చర్చ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఐజయ్య మాట్లాడుతూ ఉరవకొండ పట్టణంలో 52 ఏరియాలను ఐదు జోన్లుగా విభజించి ఒక్కో జోన్‌కు సూపర్‌వైజర్లుగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బందిని, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, లైన్‌మెన్లను నియమించడం జరిగిందన్నారు. ఎంపీపీ ఎం.నరసింహులు మాట్లాడుతూ గ్రామాల్లో రాత్రిళ్లు 1,2 గంటలకు కూడా నీటిని సరఫరా చేస్తున్నారని ఇది సరైంది కాదని పగటిపూట నిర్దిష్టమైన సమయాల్లో సరఫరా చేయాలన్నారు. దీంతో స్పందించిన ఎంపిడీవో బి.వి.రవిప్రసాద్ మాట్లాడుతూ రాత్రిళ్ళ నీటి సరఫరా చేయకుండా చూడాలని సూచిస్తూ పంచాయతీ పరిపాలన అధికారులు నీటి వృధాను అరికట్టడానికి చొరవ తీసుకోవాలని, కుళాయిలకు బిరడాలు బిగించేలా చూడాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ జి.వన్నూరుసాబ్ మాట్లాడుతూ కొలిమి, రాయంపల్లి లేఅవుట్లలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని ఆ ప్రాంత ప్రజలు డిపాజిట్లు కట్టడానికి కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ క్రమంలో ఉరవకొండ 10వ వార్డు ప్రజలకు సంబంధించి కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించి లబ్దిదారులకు స్థలాలు చూపాలని, కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ప్లకార్డును ప్రదర్శించారు. పట్టణంలో గాడిదలు అధికమయ్యాయని కుక్కలు, కోతుల దాడులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమస్యలు పరిష్కరించాలన్నారు. డ్రైనేజీలు నిర్మించాలని కోరుగా స్పందించిన పీఏసీఎస్ ఛైర్మెన్ ప్యారం కేశవానంద మాట్లాడుతూ పట్టణంలోని 7 ప్రధాన డ్రైనేజీలను శాశ్విత ప్రాతిపదికన నిర్మించడానికిను అంచనాలను తయారు చేయాలని ఇదివరకే మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారని త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందన్నారు. సమావేశంలో విద్యుత్ ఏఈ గురుమూర్తి మాట్లాడుతూ చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ మే నెల నుంచి అమలులోకి వస్తుందన్నారు. పీఎం సూర్య ఘర్ యోజన పథకం గురించి వివరించారు. ఏవో రామకృష్ణుడు మాట్లాడుతూ ప్రతి రైతు యునిక్ ఐడీ 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య కలిగి ఉండాలని అప్పుడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ కార్యక్రమాల ద్వారా లబ్ది పొందడానికి వీలుంటుందన్నారు. మండల ఇంజనీర్ రవీంద్ర మాట్లాడుతూ పల్లె పండుగ కింద ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రోడ్లు వేయడం జరిగిందని సచివాలయాలు, ఆర్‌బీకే భవనాలు పూర్తి 7 నుంచి 8 కోట్లతో నిర్మాణాలు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

03ATP06_03ATP06.qxd 07-04-2026 AM 12:39 Page 1

ఫ్యాప్టో ప్రారంభించిన మలిదశ పోరాటాలు

నిరసన వ్యక్తం చేస్తున్న ఫ్యాప్టో నేతలు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

రాష్ట్ర ఫ్యాప్టో మలిదశ పోరాటంలో భాగంగా సోమ వారం ఉదయం 9 గంటల సమయంలో పదవతరగతి జవాబుపత్రాల మూల్యాంకన కేంద్రం, స్థానిక కె.ఎస్.ర్ స్కూల్‌నకు ఉపాధ్యాయులు మూల్యాంకన విధులకు ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిరసన వ్యక్తం చేస్తూ నల్ల బ్యాడ్జిలతో హాజర య్యారు. మూల్యాం కన కేంద్రం వద్ద జిల్లా ఫ్యాప్టో సభ్యులు, మూల్యాం కనానికి హాజరైన ఉపాధ్యాయులు 12వ పి.ఆర్.సి కమీషన్ను వెంటనే నియమించాలని, కనీసంలో కనీసం 30 తాత్కాలిక మధ్యంతర భృతిని వెంటనే ప్రకటిం చాలని, వాటితోపాటు పలు డిమాండ్లను చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో సభ్యులు శ్రీనివానాయక్, పురుషోత్తం, రమణారెడ్డి, నరేష్, అక్కులన్న, కోటేశ్వరరావు, అశోక్, పలువురు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యస్వీ డిగ్రీ, పిజి కళాశాలలో బేకింగ్, కన్‌ఫెక్షనరీ సైన్స్‌పై మూడు రోజుల వర్క్‌షాప్ ప్రారంభం

వర్క్‌షాప్ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

స్థానిక యస్వీ డిగ్రీ, పిజి కళాశాలలో కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి అధ్యక్షతన లైఫ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో, ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సహకారంతో ఓవెన్ నుంచి పోషకాహారం వరకు బేకింగ్, కన్‌ఫెక్షనరీ సైన్స్ అనే అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్ ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వి.హిమ బిందు విష్కన్ బేక్ వ్యవస్థాపకులు హాజరై మాట్లాడుతూ.. ఆహార పరిశ్రమలో ఉన్న విస్తృత అవకాశాలు, నాణ్యమైన బేకింగ్ ఉత్పత్తుల తయారీలో శాస్త్రీయ దృక్పథం అవసరాన్ని వివరించారు. ఆర్.జైబా షెహనాజ్ డైటిషన్ అండ్ న్యూట్రిషనిస్ట్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్.ఎ.వి.ప్రసాద్, ఎఓ ఎ.శ్రీనాథ్, వర్క్‌షాప్ కన్వీనర్ జి.సాయి ప్రీతీ, ఐఐసి.కన్వీనర్ యస్.రిజ్వానా బేగం, అధ్యాపకులు టి.సుదర్శన్ రెడ్డి, డి.మలిహ, వివిధ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలో విచ్చలవిడిగా ముందస్తు అడ్మిషన్ల ఫ్లెక్సీలు

- జిల్లా విద్యాశాఖ అధికారులకు కానీ మున్సిపల్ అధికారులకు కానీ కనపడవా?? - ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబుకి వినతి - ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి

నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

అనంతపురం నగరంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధ ంగా పాఠశాల అడ్మిషన్ల ప్రారం భమంటూ ముందస్తుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిం చాలని ఏఐఎస్ఎఫ్ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి డీఈవో ప్రసాద్ బాబు సార్‌కి వినతిపత్రం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి మాట్లాడుతూ.. అనంత పురం నగరంలో ఎన్నడూ లేని విధంగా 2026-27 అకాడమీ ఇయర్‌కి సంబంధించి అడ్మిషన్లు ప్రారంభం మా విద్యాసంస్థలలో చేరండి అంటూ నగరంలో ప్రధాన కూడలిలో యాడ్స్ రూపంలో ఉన్నటువంటి వాటికి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. డీఈఓ గారు తక్షణమే మున్సిపల్ కమిషనర్ గారికి లెటర్ రాసి ఏవైతే నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారో వాటిని తొలగిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ అనంతపురం నగర అధ్యక్షులు మంజునాథ్ నగర కోశాధికారి నాని నాయకులు తేజ బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కపాడం నాగన్న పార్థివ దేహానికి నివాళులు అర్పించిన తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి ..!

నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

మండల పరిధిలోని యం.చర్లోపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కాపాడం నాగన్న అనారోగ్యంతో బాధపడుతూ తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, యం.చెర్లోపల్లి గ్రామంలోని వారి స్వగృహంకు చేరుకుని నాగన్న భౌతిక దేహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది. వైసిపి సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డితో మండల కన్వీనర్ సాకే వెంకటేష్. యూత్ కన్వీనర్ విశ్వనాథరెడ్డి మండల నాయకులు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బోయ అమర్

అనంతపురం రూరల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

అనంతపురం రూరల్ మండలం కళ్యాణ్ దుర్గం రోడ్డు అక్కంపల్లి పంచాయతీ సమీపంలోని రజాక్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఆత్మకూరు మండలానికి చెందిన బోయ అమర్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. రోడ్డు ప్రమాద సంఘటన తెలుసుకున్న రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని జరిగిన సంఘటనపై వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుత్తిలో ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవం

బిజెపి పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుత్తి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

గుత్తి మున్సిపాలిటీతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సోమవారం భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహిం చుకున్నారు. ఈ సందర్భంగా బిసి కాలనీ, ఎన్టీఆర్ సర్కిల్, వన్నెదొడ్డి, బసినేపల్లి, అనగానదొడ్డి, తాడిపత్రి రోడ్లులో పార్టీ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఆయా కార్యక్ర మాల్లో పార్టీ నాయకులు వెంకప్ప, నూరుల్ హసన్‌బాష, తిమ్మారెడ్డి, రంగస్వా మిరెడ్డి, చంద్రశేఖర్, బావిగడ్డ ఓబులయ్య, కందుల హేమలత, ప్రేమ్‌కు మార్, రంగరాజు, కవితశర్మ, నారాయణరెడ్డి, లక్ష్మయ్య, వీరోజిరావు, రామా ంజనేయులు, మాణిక్యం, బాలకృష్ణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్‌కు భారతరత్న ఇవ్వాలి - ఎం ఎస్ ఎస్ ఎస్ నాయకులు డిమాండ్

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బోయ అమర్

అనంతపురం రూరల్, ఏప్రిల్ 05 ప్రభాతవార్త

భారత మాజీ కేంద్ర మంత్రి బాబు జగ్జీవన్ రామ్‌కు భారతరత్న ప్రకటించాలని మాదిగ సంక్షేమ సేవా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురం నగరపాలక కార్యాలయం ముందు ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఆయన 118వ జయంతి సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాకే రామతీర్థ, జిల్లా అధ్యక్షులు మన్నల సుబ్రహ్మణ్యం పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భార తదేశ ఉప ప్రధానమంత్రిగా, రైల్వే, పురపాలక, పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖల వంటి కీలక విభాగాల్లో కేంద్ర మంత్రిగా సేవలందించి ఆయా శాఖలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన నాయకుడు జగ్జీవన్ రామ్ అని పేర్కొన్నారు. సుమారు 30 సంవత్సరాల పాటు కేంద్ర మంత్రిగా సేవలంది ంచిన ఆయన విద్యార్థి దశ నుంచే సామాజిక న్యాయం కోసం పోరాడి స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొని జైలు జీవితం గడిపారని గుర్తుచేశారు. దేశ అభివృద్ధిలో ఆయన చేసిన సేవలు అపారమని, ఇంతటి ఘన చరిత్ర కలిగిన నాయకుడికి భారతరత్న ప్రకటిం చడం ద్వా రా గౌరవించాల్సి న అవసరం ఉందన్నారు. అలాగే ఆయన సమానత్వం, సామాజిక న్యా యం కోసం చేసిన కృషి నే టి తరాలకు ఆదర్శమని తెలి పారు. దళితుల అభ్యున్నతికి ఆ యన చేసిన సేవలు చిరస్మర ణీయమని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని పరిగ ణించి త్వరితగతి న నిర్ణయం తీసుకోవాలని కోరారు. యువత ఆయన జీవి తాన్ని ఆదర్శంగా తీసుకొని సమాజ సేవలో ముందుకు రావాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో సి. శంకరయ్య, ఎక్కలూరి నాగరాజు, కోటంక మల్లేష్, గూడూరు చంటి, జరుపుల రాణా ప్రతాప్, ప్రసాద్, సాకే నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులజీతాలనువెంటనేచెల్లించాలి - సిఐటియు నేతలు

మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు,మున్సిపల్ కార్మికులు

కదిరి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

మున్సిపల్ కార్మికులకు సంబంధించిమార్చినెల జీతాలు వెంటనేచెల్లించాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసనకార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా 48వేలమంది కార్మికులకు మార్చి నెల జీతాలు అందక దిక్కుతోచనిస్థితిలో ఉన్నారన్నారు. ప్రతి నెల 1 లేదా 2వ తేదీల్లో జీతాలుపంపిణీ చేసేవారని, ప్రస్తుతం 6వ తేది వచ్చినా నేటికీ జీతాలు రానిపరిస్థితి నెలకొందన్నారు. జీతాలు ఎప్పుడు వస్తాయన్నది అధికారులు కూడా చెప్పకుండా ఉన్నారని,ప్రస్తుతం నిధి పోర్టర్‌లోకి కార్మికుల పేర్లుమార్చడం వల్ల వేతనాలు ఆలస్యం అవుతున్నాయని, క్షేత్రస్థాయిలో అధికారులు కార్మికులకు చెబుతున్నప్పటికీ జీతాలు రాకపోవడంతో కార్మికులు అందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తక్షణమేకార్మికులకు జీతాలుచెల్లించానలి డిమాండ్ చేశ్శారు. ఈ కార్యక్రమం లో సిఐటియు పట్టణ కార్యదర్శి బాబ్‌జాన్,మున్సిపల్‌యూనియన్ నాయకులు తిరుపాల్, జనార్ధన్, బాలకృష్ణ, సూరి, రాజు, రామాంజులు, నరసింహ మూర్తి, రేవతి, రామాంజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు వ్యక్తి దారుణ హత్య..!!

హత్యకు గురైన మజ్జిగ కృష్ణ

కృష్ణ (ఫైల్ ఫోటో)

గుంతకల్లు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

పట్టపగలు ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఇరువురి కుటుంబాల్లో చోటు చేసుకున్న ఘర్షణలు హత్యకు దారి తీశాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణ శివారులోని ఏసీఎస్ మిల్ ప్రాంతానికి చెందిన మజ్జిగ కృష్ణ, కొనకొండ్ల గ్రామానికి చెందిన లింగయ్యలు ఒకే కుటుంబంలోని అక్క చెల్లెలు రామలక్ష్మి, గంగమ్మలను వివాహం చేసుకున్నారు. వీరు పాత గుంతకల్లులోని కుంటమ్మకట్ట వీధిలో నివాసం ఉంటున్నారు. తాగుడుకు బానిసైన సద్దుడు లింగయ్యను మజ్జిగ కృష్ణ అనేక సందర్భాల్లో బుద్ధిగా బతకాలని మందలించేవాడు. కుటుంబ సభ్యుల ఎదుట తరచూ మందలిస్తుండడంతో మజ్జిగ కృష్ణపై లింగయ్య కక్ష పెంచుకున్నాడు. సోమవారం ఉదయం 9.30 గంటల సమయంలో మజ్జిగ కృష్ణ దంపతులు పాత గుంతకల్లులోని శివాలయంలో పూజలు ముగించుకొని బయటకు వచ్చారు. ద్విచక్రవాహనంలో వెళుతున్న కృష్ణను అప్పటికే అక్కడ కాపు కాచిన లింగయ్య వాహనాన్ని అడ్డగించి కళ్ళలో కారం చల్లి ఇనుపరాడ్డుతో తల వెనుక బలంగా కొట్టాడు. కింద పడిన కృష్ణను ఇనుపరాడ్డుతో పదేపదే తలపై బాధడంతో కృష్ణ (49) అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య రామలక్ష్మి గట్టిగా కేకలు వేయడంతో రక్తపు మడుగులో పడి ఉన్న భర్తను స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే కృష్ణ మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్పాట్ కు 20 శాతం మంది టీచర్లు దూరం

808 మందిలో రిపోర్ట్ చేసుకున్నది 640 మాత్రమే - నేడు రిపోర్ట్ చేసుకోకపోతే జారీ చేయనున్న నోటీసులు - అదేవిధంగా కొన్ని మొరాయించిన ట్యాబ్ లు

మొరాయించిన ట్యాబులను పరిశీలిస్తున్న జిల్లా అబ్జర్వర్ సుబ్బారావు, డీఈఓ ఎం. ప్రసాద్ బాబు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

పదో తరగతి స్పాట్ వ్యాల్యూషన్ కు ఆర్డర్ వచ్చిన ప్రతి టీచర్ రిపోర్ట్ చేసుకోవాలని నిబంధన ఉంది. కానీ ఆర్డర్లు వచ్చిన వారిలో 20 శాతం మంది టీచర్లు రిపోర్టు చేసుకోకపోవడం గమనార్హం. ఈనెల 6 నుంచి 15వ తేదీ వరకు జరిగే పదో తరగతి స్పాట్ వ్యాల్యూషన్ ప్రక్రియ జిల్లా కేంద్రంలోని కెఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల లో సోమవారం ప్రారంభమైంది. 485 మంది ఏఈలకు గాను 385 మంది రిపోర్ట్ చేసుకున్నారు. ఇందులో ఇంకా వందమంది రిపోర్టు చేసుకోలేదు. అలాగే 83 మంది సీఈలలో 70 మంది రిపోర్ట్ చేసుకున్నారు. ఇందులో 13 మంది రిపోర్ట్ చేసుకోలేదు. అలాగే 240 మంది స్పెషల్ అసిస్టెంట్లలో 185 మంది రిపోర్టు చేసుకున్నారు. ఇందులో 55 మంది రిపోర్టు చేసుకోలేదు. ఉదయం నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రిపోర్ట్ చేసుకోవడానికి అవకాశం ఇచ్చినప్పటికీ 20 శాతం మంది టీచర్లు రిపోర్ట్ చేసుకోలేదని అధికారులు గుర్తించారు. ఆ 20 శాతం మంది టీచర్లు రిపోర్టు చేసుకోవడానికి మంగళ వారం కూడా అవకాశం ఇచ్చారు. అప్పటికి రిపోర్ట్ చేసుకోకపోతే నోటీసులు ఇవ్వడానికి అధికారులు నిర్ణయించారు.కొత్త పద్ధతిలో స్పాట్ వ్యాల్యూషన్: మొదటిరోజు స్పాట్ వ్యాల్యూషన్ ప్రక్రియ మధ్యాహ్నం నుండి ప్రారంభమైంది. సబ్జెక్టు వారిగా ఒక్కొక్కరికి 20 పేపర్లు మాత్రమే ఇవ్వడం జరిగింది. స్పెషల్ అసిస్టెంట్లకు 250 ట్యాబ్ లను అందజేశారు. అందులో లీప్ యాప్ లో ఓఎంఆర్ షీట్ లోని యువర్ కోడ్ ను స్కాన్ చేసి మార్కులు అప్లోడ్ చేయడం జరిగింది. కొన్ని మొరాయించిన ట్యాబ్ లు: కొత్త పద్ధతిలో పదో తరగతి స్పాట్ వ్యాల్యూషన్ ప్రక్రియను నిర్వహించడానికి విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఆ విధంగా జిల్లాకు 350 క్యాబ్ లను వినియోగించుకోవడానికి అనుమతి ఇవ్వడం జరిగింది. స్పెషల్ అసిస్టెంట్లు వారికిచ్చిన ట్యాబ్ లలో లిప్ యాప్ లో లాగిన్ అయిన తర్వాత అందులో ఎస్ఎస్సి మార్కులు ఎంట్రీ లో మార్కులు అప్లోడ్ చేయడం జరిగింది. ఈ ప్రక్రియను జిల్లా అబ్జర్వర్, జెడి సుబ్బారావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబు, అనంతపురం ఉప విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు కలిసి పరిశీలిస్తుండగా... కొందరు స్పెషల్ అసిస్టెంట్లు ఈ ట్యాబులు సరిగ్గా పనిచేయకుండా మొరాయిస్తున్నాయని చెప్పడంతో వాటిని అధికారులు కూడా పరిశీలించారు. అప్పుడు టెక్నికల్ సిబ్బంది వచ్చి చూసినప్పటికీ కూడా అవి వినియోగంలోకి రాలేదు. ఆ తర్వాత కొంతసేపటికి అవి పని చేయడం జరిగింది. రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం నుండి కూడా ఒక టెక్నికల్ పర్సన్ రావడం జరిగింది. అతను కూడా ట్యాబులను పరిశీలిం చగా... సగం బాగా పనిచేస్తు న్నాయని, మిగతా సగం నెట్వా ర్క్ సమస్య వలన మొరా యిస్తు న్నాయని, చాలా కాలం వినియోగించుకోవడం వలన, అప్డేట్ చేయకపోవడం వలన, నెట్వర్క్ సమస్య వలన ఇలా మొరాయిస్తున్నాయని , విని యోగిస్తూ ఉంటే బాగా పనిచే స్తాయని జిల్లా అబ్జర్వర్, డీఈఓ కు చెప్పడం జరిగింది. టెక్నిక ల్ సిబ్బంది సంఖ్యను పెంచి క్యాబ్లు బాగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని జిల్లా అబ్జర్వర్, డీఈఓ తెలిపారు.తెలుగు టీచర్ హిందీ ఆర్డర్ క్యాన్సిల్:ఉరవకొండ మండలం వై.రాంపురం ప్రైమరీ స్కూల్ హెచ్ఎం గా పనిచేస్తున్న తెలుగు స్కూల్ అసిస్టెంట్ బాలసుబ్రమణ్యం కు స్పాట్ వ్యాల్యూషన్ లో హిందీ సబ్జెక్టుకు ఆర్డర్ రావడం జరిగింది. దీనిని ఆయన అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ పట్టించుకోకపోవడంతో సోమవారము వార్త దినపత్రికలో కథనం ప్రచురితం అయింది. ఇందుకు ఉన్నతాధికారులు స్పందించి ఆ ఆర్డర్ ను క్యాన్సిల్ చేయడం జరిగింది. ఇలా పదో తరగతి సబ్జెక్టు బోధించని టీచర్ల ఆర్డర్లను కూడా క్యాన్సిల్ చేస్తామని, 60 ఏళ్ళు పైబడిన టీచర్లు, అనారోగ్య సమస్యలు ఉన్న టీచర్ల ఆర్డర్ ను కూడా ఆధారాలను పరిశీలించి క్యాన్సిల్ చేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు. అంతేకాకుండా ఆ ఐటీ సెల్ ఉద్యోగి స్పాట్ కేంద్రంలోని కూర్చొని విధులు నిర్వర్తించడం జరిగింది.

సాంకేతికతను ఆర్థిక అభివృద్ధికి కాకుండా సమాజ శ్రేయస్సుకు ఉపయోగించండి

సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్



విద్యార్థికి గోల్డ్ మెడల్, సర్టిఫికెట్‌ను అందిస్తున్న గవర్నర్

(మొదటి పేజీ తరువాయి) భాగంగా 2047 నాటికి భారత దేశానికి పూర్తిగా అభివృద్ధిన స్వయంసంవృద్ధిగల సమ్మిలిత ఆవిష్కరణల ఆధారిత దేశంగా మార్చాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా రన్నారు. అదే విధంగా జాతీయ విద్యా విధానం 2020 మార్గ దర్శకత్వంలో అభయసనం, పరిశోధన నైపుణ్యం, సంస్థాగత స్వయం ప్రతిపత్తి ప్రపంచ సహకారాన్ని ప్రోత్సహించడానికి ఉన్నత విద్యా వ్యవస్థ పునర్నించబడుతోందని పేర్కొన్నారు. జెఎన్‌టియుఏ జాతీయ అభివృద్ధికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు దోహదపడే నైపుణ్యం, నైతికత నూతన ఆలోచనలుగల పట్టభద్రులను తీర్చి దిద్దడలో కీలక పాత్ర పోషిస్తోందని కొని యాడారు. గత ఏడాది కాలంగా ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతమైన సమ్మిళి తమై న,ఉన్నత విద్యా వ్యవస్థ అభివృద్ధిచెందిందని ఆయన పేర్కొన్నారు. సామాజిక అవసరాలకు అనుగుణ ంగా పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణలకు సుస్థిర అభివృద్ధినిముందుకు తీసుకెళ్లడానికి రాష్ట్రానికి బలమైన సామర్థ్య ఉందని గవర్నర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్యానికి ముఖద్వారంగా మారుతోందని, రహదారులు,పారిశ్రామిక కారిడార్లు, డిజిటల్ మౌలిక సదుపాయాలలో భారీపెట్టుబడులు ఆర్థిక కార్యకలాపాలను వేగవం తం చేసి ఉపాధి అవకాశాలను సృష్టించాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ఆచరణాత్మక శిక్షణను అందించడానికి పరిశ్రమ, సంస్థల సహకారాన్ని బలోపేతం చేస్తూ మరోవైపు ఆవిష్కరణలు, స్టార్టప్‌పర్యవరణ వ్యవస్థను ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు విదేశీ ఉద్యోగులపట్ల ఆసక్తికం టేరాష్ట్రంలో మెరుగుపడుతున్న ఉద్యోగ అవకాశాలను మెరుగుప ర్చుకోవాలని సూచించారు. డాక్టరేట్ పొందిన జెస్సీ థామస్ మాట్లాడుతూ.. తన విద్యా ప్రస్తానాన్ని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌తో ప్రారంభించి, గైడైడ్ మిస్సైల్స్‌లో హైదరాబాద్ నుంచి పిహెచ్‌డి పట్టాను పొందానని గుర్తు చేశా రు. భారత దేశపు వ్యూహాత్మక క్షిపణి కార్యక్రమానికి సాంకేతిక అభివృద్ధి,తయారీపరీక్ష, వ్యవస్థ ధృవీకరణ,నిర్వహణ వంటి రంగాలలో పాలు పంచుకునే అవకాశం తనకు దక్కిందన్నారు. అగ్ని-1 నుంచి అగ్ని-5వరకు భారతదేశం స్వావలంభన సాధించి రక్షణ సామర్థ్యంలో భారతదేశాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టామని పేర్కొన్నారు. మన శాస్త్ర వేత్తలు, సాంకేతిక నిపుణులు నిరంతరం కృషి చేసి దేశాన్ని అనేక రంగాలలో అభివృద్ధి చెందుతున్న శక్తిగా మార్చారని పేర్కొన్నారు. అనంత రిక్ష, రక్షణ, అనుసాంకేతిక రంగాలలో అగ్రశ్రేణి సరసన నిలబెట్టారని కొనియాడారు. జెఎన్‌టియుఏ విసి సుదర్శనరావు మాట్లాడుతూ..జెఎన్‌టియుఏ అందరి సహకారంతో అన్ని వ్యవస్థల్లో అగ్రగామిగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా జెఎన్‌టియుఏ పనిచేస్తూ ముందుకెళ్తోందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఛాన్సలర్ హోదాలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులు మీదుగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలను పంపిణీచేశారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను, డాక్టరేట్ పొందిన జెస్సీ థామస్‌కు విసి సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్యలు మెమెంటోలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, మాజీ మంత్రిపల్లె రఘు నాథరెడ్డి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప, హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ మధుమూర్తి, యూనివర్సిటీల డైరెక్టర్లు, కళాశాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మనాభపిళ్ళై



ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభపిళ్ళై

గుత్తి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

ఏపి ట్రాన్స్‌కో గుత్తి డివిజన్ పరిధిలో మంగళవారం 220 కె.వి రిసీవింగ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మనాభపిళ్ళై తెలిపారు. ఈ మేరకు సాయంత్రం 4 గంటల నుండి 4.30 వరకు లైన్ క్లియర్ తీసుకోవడం వల్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ప్రజానీకం గమనించి సహకరించాలని ఆయన కోరారు.

చెత్తను వేరు చేయడంపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 కార్యక్రమంలో భాగంగా సోమవారం హనుమేష్‌నగర్‌లోని రోటరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు చెత్తను వేరు చేయడంపై అవగాహన కల్పించారు. ఇంటి వద్ద తడి చెత్త, పొడి చెత్త, హానికరం చెత్తను మూడు రకాలుగా ఎలా వేరు చేయాలో వివరించారు. అలాగే ప్లాస్టిక్ వినియోగంపై కలిగే అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ నగర పరిశుభ్రతను ప్రతి ఒక్కరు బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, ఉపాధ్యాయులు, పర్యావరణ కార్య దర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

బీజేపీ జెండా ఆవిష్కరి ంచిన నాయకులు

గుంతకల్లు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పాత గుంతకల్లు అంకాలమ్మ దేవాలయం వద్ద ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6న పార్టీ ఆవిర్భవించిందన్నారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి, లాల్‌కృష్ణ అద్వానీ సారథ్యంలో బిజెపి దేశమంతటా వ్యాప్తి చెందిందన్నారు. ప్రతి వ్యక్తికి సంక్షేమ ఫలాలు అందించాలనే సంకల్పంతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేస్తున్న కృషి ఇతర దేశాలకు ఆదర్శమన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నెట్టికంటయ్య, నారాయణరెడ్డి, మస్తాన్, పురంధర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానానికి చిరునామాగా రాయలసీమ

ప్రజావేదికకుహాజరైన జిల్లా అధికారులు

సీఎంకు జ్ఞాపికను అందిస్తున్న జూనియర్ జేసీ సోదరులు

(మొదటి పేజీ తరువాయి) ఊడుతుందని గనుల శాఖ డీడీ ఆదినారాయణను సీఎం హెచ్చరించారు. ఉచిత ఇసుకకు ఎవరూ అడ్డుపడకూడదని కలెక్టర్‌ను సభాముఖంగా ఆదేశించారు. రాష్ట్రానికి రూ. వెయ్యి కోట్లు ఆదాయం వదులుకొని ప్రజలకు ఉచిత ఇసుక ఇస్తున్నామని, నిబం ధనలు ఉల్లంఘిస్తే రెగ్యులరైజ్ చేయవచ్చని సీఎం అన్నారు. అంగన్‌వాడీ వ్యవస్థ సరిగా పనిచేయకపోవడంతోనే రాష్ట్ర, నియోజకవర్గ స్థాయి కంటే జిల్లా స్థాయిలో చాలా వెనుకబడి ఉందని, సమర్థత చూపించాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవికి సూచించారు. ఏపీఎస్‌ఆర్టీసీ సేవలు రాష్ట్రంలో 53 శాతం ఉంటే నియోజకవర్గంలో 45 శాతం, జిల్లాలో 47 శాతం ఉందని, బస్సుల్లో కండక్టర్ ప్రవర్తన, సమయపాలనల్లో సమస్యలున్నాయని సీఎం ఆర్ఎం శ్రీలక్ష్మికి సూచించారు.

:రిజర్వాయరు తీర సందర్శన..శ్రేణులతో సమావేశం

ప్రజావేదిక ముగిసిన తర్వాత అత్తిరాళ్ల దిన్నె సమీపంలోని పెండేకల్లు రిజర్వాయరు తీర ప్రాంతాన్ని సీఎం సందర్శించారు. బిందు సేద్యం, ప్రకృతి వ్యవసాయం, పీఎండీఎస్, ఉపాధి హామీ సహ వివిధ అంశాలపై రైతులు, కూలీల అభిప్రాయాలను ఆయన సేకరించారు. స్థానిక రైతులు నీలం శ్రీనివాసరెడ్డి, లక్కు శ్యామలతో సాగునీటి అవసరాలు, సాగునీటి కోసం అవలంబిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు యుగంధర్, హరికృష్ణ, దేవిలతో రుతుపవనాల కంటే ముందు పొడి విత్తనాల సాగు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాగులో అర్ధచంద్రాకార గుంతల విధానం ద్వారా నేల సారవంతంగా మారి మెరుగైన ఫలితాలు వస్తున్నట్లు రైతులు నందిని, ప్రమీలమ్మలు ముఖ్యమంత్రికి తెలిపారు. అనంతరం ఆయన పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. గత ప్రభుత్వంలో ఎన్నో కష్ట, నష్టాలను ఎదుర్కొని పార్టీ విజయానికి కారణమైన కార్యకర్తలను మరువబోమని,కార్యకర్తల కృషిని గుర్తుపెట్టుకొని పార్టీ తగిన న్యాయం చేస్తుందని ఆయన శ్రేణులకు భరోసా కల్పించారు.

వైఎస్సార్‌సీపీ కంచుకోటలు ఎక్కడా చెక్కు చెదరలేదు..!

-నిజాయితీ, నిబద్ధతతో వైఎస్సార్‌సీపీ సర్పంచులు ఐదేళ్లు లందించారు -మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి -ఇటీవల పదవీ విరమణ పొందిన వైఎస్సార్‌సీపీ సర్పంచులకు ఘన సన్మానం

ఉరవకొండ, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

వైఎస్సార్‌సీపీ కంచుకోటలు ఎక్కడా చెక్కు చెదరలేదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఇటీవల పదవీ విరమణ పొందిన నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ సర్పంచులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించి వారికి శాలువాలుకప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలిచిన సర్పంచులు నిజాయితీగా, నిబద్ధతతో ప్రజలకు ఐదేళ్లు సేవలందించి మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. నియోజకవర్గంలో ఒకటి అర మినహా అన్ని గ్రామాల్లోనూ వైఎస్సా ర్‌సీపీ మద్దతుదారులే సర్పంచులుగా ఎన్నికై చరిత్ర సృష్టించారన్నారు.

IN THE COURT OF THE Ist ADDL. DISTRICT JUDGE: ANANTHAPURAMU
I.A.No:01/2026 in O.S. No: 03/2026
Between:
Karnatakam Sarath Babu,
...Petitioner/Plaintiff
And
Dabbara Jayasree @ Guntipalli Jayasree
...Respondant/Defendant
Notice to the Respondant/Defendant
To, Dabbara Jayasree @ Guntipalli Jayasree, W/o. Guntipalli Surendra Babu, D.No.6-5-545, Ram Nagar, Opp. Petrol Bunk, Anantapuramu Town and Dist.
పై నెంబరు కేసులో Respondant/ Defendant అయిన మీ హాజరు నిమిత్తము 20-04-2026వ తేదీ ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
నీరుగంటి ఆదిశేషారెడ్డి, అడ్వకేట్, అనంతపురము. సెల్ :9441734996

04ATP06_04ATP06.qxd 07-04-2026 AM 12:38 Page 1

మనకు బంగారం కన్నా నీరు విలువైంది

- నీటిని ఒడిసి పట్టుకుందాం - రైతులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్, 6 ప్రభాతవార్త

ఉమ్మడి అనంతపురం జిల్లా కరవు జిల్లా అయిన మన ప్రాంతంలో నీరు బంగారం కన్నా విలువైందని.. దానిని ఒడిసి పట్టుకుందామని రైతులకు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు నిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలధార నీటి భద్రత సాగునీటి సం ఘాల బాధ్యత కార్యక్రమాన్ని సోమవారం రాప్తాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారు. చెన్నేకొత్తపల్లి మండలం కనుము క్కల గ్రామంలో ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. చెరువు వద్ద రైతు లు, సాగునీటి సంఘాలతో సమావేశమై.. ఎలాంటి చర్య లు చేపట్టాలన్నది చర్చించారు. చెరువుకు నీరు తీసుకుని రావడం దగ్గర నుంచి ఎలా వినియో గించుకోవాలన్న దానిపై 100రోజుల ప్రణాళిక సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సునీత సూచిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో నీరు,చెట్టు కార్యక్రమాన్ని ముఖ్య మంత్రి చంద్రబాబు రామగిరి మండలం కుంటిమద్దిలో ప్రారంభించా రని ఇప్పుడు అలాంటి కార్యక్రమాన్నే యాడికిలో ప్రారంభించారన్నారు. జిల్లా పట్ల, ఇక్కడి రైతుల పట్ల ఆయన కున్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. రైతుల కోసం రాష్ట్రంలో వ్యవసా యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్ర బాబు ఎండ, గాలి, వానను సైతం లెక్క చేయకుండా ఇలాంటి పర్యటనలు చేస్తున్నారన్నారు. ఇదేదో హడావుడిగా ప్రారంభించి వెళ్లిపోయేది కాదని.. ప్రతి రోజు మనం బాధ్యత తీసుకుని ముం దుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. హంద్రీనీవా ద్వారా శ్రీశైలం నుంచి ఇక్క డికి వరకు నీరు వస్తోందంటే కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

: జెసిబిని డ్రైవ్ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఇలాంటి సమయంలో నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వాడుకో వాలన్నారు. ముఖ్యంగా వర్షం వచ్చిన ప్పుడు నీటిని నిలుపుకుని భూమిలో భద్రంగా దాచుకోవాల్సిన అవసరం ఉంద న్నారు. ప్రస్తుతం ఉన్న చెరువులను ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలి నీరు వచ్చే మార్గాలను ఎలా విస్తృతం చేసుకోవాలి, పూడిక తీత వంటి చర్యలు ఎ లా చేయాలన్నది సాగు నీటి సంఘాలు చూడాలన్నారు. వారంతా రైతుల తో చర్చించి వారి భాగస్వామ్యంతో ప్రణాళికలు చేయాలన్నారు. సరైన ప్రణా ళికతో ప్రభుత్వానికి నివేదిక పంపితే కచ్చితంగా నిధులు వస్తాయన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో 70లక్షలకు పైగా నిధులు వచ్చాయన్నారు. ముష్టి కోవెల చెరువుకు 75లక్షలు, కనుముక్కల చెరువుకు 27 లక్షల రూపా యల తో పనులు చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్య తగా తీసుకుని ముందుకు నడిపించాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో మండల కన్వీనర్ ముత్యాలరెడ్డి, హిందూపురం పార్లమెంటు ఉపా ధ్యక్షులు దండు ఓబులేసు, మండల అధికారులు నాయకులు రైతులు పాల్గొన్నారు.

సీఎం సభలో వినతుల వెల్లువ

-ఫిర్యాదు చేయడానికి వచ్చిన ర్యాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా సభ్యులు

-ఫిర్యాదు చేయడానికి వచ్చిన ర్యాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా సభ్యులు

భూసేకరణ ధరపై వినతులిస్తున్న రైతులు

యాడికి(తాడిపత్రి), ఏప్రిల్6, ప్రభాతవార్తఃఃయాడికి మార్కెట్ యార్డులో సోమవారం సీఎం రాక సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక ప్రాంగణంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువెత్తాయి. ర్యాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా(అంబేద్కరిస్ట్) పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరనాగరాజు, ఎస్సీ ఆర్మీ అధ్యక్షుడు కిశోర్, ఆర్పీఐఏ మండల నాయకుడు కంబగిరి రాముడు తదితరులు మండలంలో నెలకొన్న సమస్యలపై సీఎంకు వినతి పత్రం ఇవ్వడానికి వెళితే అధికారులు అడ్డుకోవ డాన్ని ఖండించారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులిస్తే అవి మండల అధికారులకు వెళతాయే తప్ప జిల్లా అధికారులకు గాని, సీఎంకు గాని వెళ్లవని అక్కడి అధికారులు నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని వారు ఆరోపించారు. యాడికిలో నెలకొన్న చేనేత సమస్యలపైన గాని, ఎస్సీ, ఎస్టీల రాయితీ రుణాల మంజూరుపైనా స్పష్టత ఇవ్వాలని సీఎంను కోరదామనుకుంటే ఆ అవకాశం కల్పించకపోవడంపైనా వారు మండిపడ్డారు. రాయల చెరువు లోని ఎస్సీ రైతులు సాగు చేసుకు ంటున్న భూములపై కొందరు పశుగ్రాసం కోసం కావాలంటూ సంతకాలు సేకరి స్తున్నట్లు తెలిసిన విషయాన్ని, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల పేరు చెప్పుకొని కొందరు వ్యక్తులు చేస్తున్న తప్పుడు పనులను నిలువరించాలని కోరదామంటే అవకాశం లేకుండా పోయిందని ఆర్పీఐఏ, ఎస్సీ ఆర్మీ నాయ కులు రామాంజినేయులు, నరేంద్ర, శంకర్, పుల్లయ్య తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ,ఎస్టీలపై వరుసగా జరుగుతున్న దాడులు, మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలను నిలువరి ంచాలని సీఎంకు వినతి పత్రమిచ్చేందుకు వెళుతు న్న తమను పోలీసులు అధికారులు అడ్డుకోవడాన్ని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ నేతలు తప్పు పట్టారు. ఇటీవల నర్సీపట్నంలో డప్పు కళాకారుడిపై సాక్షాత్తు శాసనసభ స్పీకరు అయన్న పాత్రుడు దాడికి పాల్పడటాన్ని, పశ్చిమ గోదావరి జిల్లా పెదపేటలో దళితులపై డిప్యూటీ స్పీకర్ ప్రోద్బలంతో అక్రమ కేసుల బనాయింపు, రైల్వే కోడూరు నియోజకవ ర్గంలో దళిత మహిళా ఉద్యోగి హర్షవీణపై జనసేన నాయకుడు తాత శెట్టి నాగేంద్ర పోలీసు లాఠీ లాక్కొని దాడి చేయడం వంటి దళిత హక్కులను హరించే సంఘటనలను సీఎం దృష్టికి తీసుకొని పోదామంటే సీఐ, పోలీసులు అడ్డుకోవడం దారుణమని నాయకులు సాకే హరి వాపోయారు. యాడికి మండలం కమలపాడు పంపుడు స్టోరేజ్ ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న తమకు పరిహారంగా రూ. 30 లక్షలు ఎకరాకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో అంతే సారవంతమైన, సాగుయోగ్య మైన భూమిని మరోచోట కల్పించమని కుందనకోట, చింతలాయపల్లి రైతులు విరుపాక్షిరెడ్డి, రామా రావు, క్రిష్ణ తదితరులు పీజీఆర్ఎస్‌లో వినతి పత్రమిచ్చారు. జర్నలిజంతో సామాజిక సేవలో పాలు పంచుకొని వృద్ధాప్యంతో జీవనాధారం లేక, ఆదాయం లేక సతమతమవుతున్న వెటరన్ జర్నలిస్టులకు పింఛను సౌకర్యం కల్పించాలని, ఆరోగ్య పరంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని కోరుతూ ఏపీ వెటరన్ జర్నలిస్టు అసోసి యేషన్ కన్వీనరు యాడికి చంద్రశేఖర్ తెదేపా నాయకుల ద్వారా సీఎంకు అందజేశారు. అంగన్‌వాడీల వేతనాల పెంపు, గ్రాట్యుటీ గైడ్‌లైన్స్‌ను రూపొ ందించి అమలు చేయాలని, మిగిలిన మినీ కేంద్రాలను మెయిన్‌గా మారా ్చలనే తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయు) నాయకులు పీజీఆర్ఎస్ ద్వారా సీఎంకు చేర్చాలని కోరుతూ సమర్పించారు. హెల్పర్స్‌కు గైడ్‌లైన్స్ జీవో సవరణ చేయా లని, మే నెలంతా సెలవులు మంజూరు చేయాలని సీఐటీయూ నాయ కులు సుబ్బరావమ్మ, మహాలక్ష్మిలు ఆ వినతి పత్రంలో విన్నవించారు.

వెల్దుర్తియర్రోని పల్లి రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత

- రూ.3.43కోట్లతో రోడ్డు నిర్మాణం

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

చెన్నేకొత్తపల్లి మండలంలో గత కొన్నేళ్లుగా ప్రజలకు నరక యాతనగా మారిన వెల్దుర్తియర్రోనిపల్లి రోడ్డు సమస్యకు ఎమ్మెల్యే పరిటాల సునీత పరిష్కారం చూపించారు. ఎన్ ఆర్ ఈ జి ఎస్ నిధులతో 8 కిలోమీటర్ల బిటీ హరహదారిని రూ.3.43 కోట్లతో నిర్మించిన ఈ రోడ్డును ఆమె సోమవారం సాయంత్రం ప్రారంభిం చారు. దీంతో ఆయా గ్రామాల పరిధిలోని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం మండల టీడీపీ నాయ కులు, స్థానిక ప్రజల మధ్య పండుగ వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ..వెల్దుర్తి నుంచి బ్రాహ్మణపల్లి మార్గంలో రోడ్డు కంకర తేలి కనీసం ద్విచక్రవాహనం వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి ఉండేదన్నారు. అడుగడుగునా గుంతలతో ప్రజలు నరకం చూ శారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డు గురించి ఏమాత్రం పట్టించుకోలేదని ఆమె విమర్శలు చేశారు. ఎన్నికల ముందు ఈ విషయాన్ని తాను కూడా ప్రత్యక్షంగా చూశా నన్నారు. ఈ రోడ్డు నిర్మిస్తానని ఆ రోజే హామీ ఇచ్చానని, ఇచ్చిన మాట ప్రకారం నిధులు తీసుకొచ్చి పూర్తి చేశామన్నారు. 8 కిలోమీ

రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

వేసిన రోడ్డును చూపుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

టర్ల మేర రోడ్డు నిర్మించి.. 11 గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం చూపించామన్నారు. రోడ్డు ప్రారంభం కావడంపై స్థానిక ప్రజలు, వాహన దారులు హర్షం వ్యక్తం చేస్తూ, గతంలో ఈ రోడ్డుపై వెల్దుర్తి వరకు ప్రయాణి ంచాలంటే 30 నిమిషాల సమయం పట్టేదని ప్రస్తుతం ఆరు నిమిషాల్లో ఇక్కడికి చేరుకుం టున్నామని ఎమ్మెల్యే సునీతకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్ర మంలో మండల కన్వీనర్ ముత్యాల రెడ్డి, హిందూపురం పార్లమెంటు ఉపా ధ్యక్షులు దండు ఓబులేసు, స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

ఎగిరిందీ....ఎగిరిందీ...కాషాయం జెండా

- గోరంట్ల మండలంలో 4 పంచాయతీల్లో....మన ఊరు మన జెండా కార్యక్రమాలు

- ఘనంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం - బిజెపి మండల కన్వీనర్ లక్ష్మినారాయణ అధ్వర్యంలో...గోరంట్ల, ఎగువ గంగంపల్లి, వానవోలు, పులేరు పంచాయతీ కేంద్రాల్లో జెండా ఆవిష్కరణ

గోరంట్ల, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని గోరంట్ల మండలంలోని నాలుగు పంచాయతీ కేంద్రాల్లో మండల కన్వీనర్ లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో సోమవారం జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అటల్ బిహారీ వాజ్‌పేయి, లాల్‌కృష్ణ అద్వాని నేతృతంలో 1980 ఏప్రిల్ 6వ తేదీ భారతీయ జనతా పార్టీ ఆవిర్భవిం చింది. అదేవిధంగా భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ సారథ్యంలో గత 12 సంవత్సరాలుగా దేశంలో భారతీయ జనతాపార్టీ అద్భుత విజయాలు సాధిస్తోంది. మన ఊరు మన జెండా కార్యక్రమాన్ని బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పిలుపు మేరకు శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు గోరంట్ల మోహన్‌శేఖర్ నాయకత్వంలో గోరంట్ల మండల అధ్యక్షులు బోయ లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో గంగంపల్లి వానవోలు, పూలేరు మరియు గోరంట్ల పట్టణంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ మేదర శ్రీనివాసులు జిల్లా బిజెపి ఉపాధ్యక్షురాలు ముంతాజ్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజ్‌యాదవ్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కాచర్ల హరీష్. మండల ప్రధాన కార్యదర్శి భజంత్రీ శంకర్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ సింగిల్ విండ్ డైరెక్టర్ పూల గంగాధర్, మార్కెట్ యార్డు డైరెక్టర్ రామాంజినమ్మ, జిల్లా మహిళా మోర్చా ఉపా ధ్యక్షురాలు లక్ష్మీదేవి. చం ద్రారెడ్డి, జెకె జగన్, ఈశ్వ ర్‌రెడ్డి, అశోక్, కాటే పల్లి నరేష్, తుకారం, పూలేరు సురేష్, జయరాంనాయక్, చుండువారిపల్లి వెంకటేష్, రామచంద్రారెడ్డి, కుర్ర ఆంజనేయులు, లక్ష్మీపతి, వానవోలు బాలకృష్ణ, చంద్ర, పూలేరు పంచాయతీ అధ్యక్షులు బుల్లెట్ సూరి, తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో బిజెపి నాయకులు

జల భద్రత మన భవిష్యత్తు తరాలకు పూర్తి భద్రత

జలధార భద్రత పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట

కదిరి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

జలధార భద్రత మన భవిష్యత్తు తరాలకు పూర్తి భద్రత అని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు.సోమవారం కదిరి రూరల్ మండలంలోని ముత్యాల చెరువు సమీపంలో జలధాన పథకం ద్వారా భూగ ర్భ జలాల పెంపు పనులను ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ప్రారం భించారు. ముందుగా పనుల వద్ద పూజలు నిర్వహించి ఎమ్మెల్యే కంది కుంట వెంకట ప్రసాద్ స్వయానా జెసిబి నడిపి ఎమ్మెల్యే పనులను ప్రారం భించా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు చేపట్టిన 100 రోజుల ప్రత్యేక కార్యచరణ రాష్ట్ర చరిత్రలో ఒక సాహసోపేతమైన ముందడుగు అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన సాగునీటి సంఘాలను మళ్లీ క్రియా శీలం చేస్తూ సుమారు 60వేల మంది సభ్యులను ఈ జలసంరక్షణ ఉద్యమంలో భాగస్వామ్యం చేయడం అధజకార వికేంద్రీకరణకు నిదర్శనం అన్నారు. వేసవిలో ఎండలు మండుతు న్నప్పుడు యుద్ధ ప్రాతిపదికన పనులను మొదలు పెట్టి వర్షాలు పడే నాటికి ప్రతి నీటి చుక్క భూమి పొరల్లోకి పంపాలన్నదే లక్ష్య మన్నారు. జల ధార స్ఫూర్తితో వాగులు వంకలను అనుసం ధానిస్తూ ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టేలా క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం కృషి చే యాలన్నారు. సాగునీటి సం ఘాలే ఈ ఉద్య మాన్ని ముందుకు నడిపించాల్సి న బా ధ్యతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డాక్టర్ పాలవల పవన్ కుమా ర్‌రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జలధార పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

రూ.50 లక్షలతో పోలీస్ శాఖకు బొలెరోలు, అపాచీ బైక్ లు

- బాలయ్య చొరవ... దాతల సహకారం

హిందూపురం. ఏప్రిల్ 6 ప్రభాతవార్త

స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకొని దాతల ఆర్థిక సహకారంతో 50 లక్షల రూపా యలు విలువైన మూడు కొత్త బొలెరో కార్లు, 9 అపాచీ బైక్ లను పోలీస్ శాఖకు అందజేశారు. ఎమ్మెల్యే బాలయ్య సోమవారం సాయంత్రం 6:20 నిమిషాలకు హిందూ పురానికి చేరుకోగానే తన క్యాంపు కార్యాలయం వద్ద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్పీ సతీష్ కుమార్ తో కలిసి పూజలు నిర్వహించిన తర్వాత పచ్చ జెండా ఊపి వాహనాలను లాంఛనంగా అందజేశారు. హిందూపురం డి.ఎస్.పి కెవి మహేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో బాలయ్య మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గ ప్రజల భద్రత ఆరోగ్య రక్షణ అభివృద్ధి ఈ మూడు తనకి ప్రధానమని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ సేవలు ఎంతో కీలకమని ఎక్కడైనా సంఘటనలో జరిగినట్టు సమాచారం వస్తే వెంటనే వెళ్లేందుకు కండిషన్ లో ఉన్న వాహనాలు అవసరమన్న ఉద్దేశంతో సి ఎస్ ఆర్ ఫండ్స్ దాతల సహకారం తో వీటిని సమకూర్చినట్లు వివరిం చారు. హెరిటేజ్ సి ఎస్ ఆర్ ఫండ్స్ ద్వారా పాఠశాలలకు కంప్యూటర్లు ఆధునిక పరికరాలను అందించామని అదేవిధంగా ఎన్టీఆర్ వైద్యరథం ద్వారా గ్రామాలకు వెళ్లి అక్కడే చికిత్సలను ఉచితంగా మందులను అందిస్తున్నామని గుర్తు చేశారు. ఇదివరకే పోలీస్ శాఖకు 30 లక్షల వ్యయంతో సీసీ కెమెరాలు 10 లక్షల రూపాయల వ్యయంతో పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని చెప్పారు. పగలనక రాత్రనక ప్రజారక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పోలీస్ శాఖకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హిందూపురం నియోజకవర్గంతో పాటు అన్ని ప్రాంతాల్లో నేరాల నియంత్రణ, శాంతి భద్రతలను పరిరక్షణకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని చెప్పారు. ముగ్గురు దాతలను బాలయ్య సత్కరించారు. అదేవిధంగా ఎస్ పి, డి ఎస్ పి బాలకృష్ణకు జ్ఞాపకం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పిఏలు శ్రీనివాసరావు, వీరయ్య, బాలాజీ తోపాటు సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

కొత్త వాహనాలకు పచ్చ జెండా అవుతున్న బాలయ్య

బాలయ్యను సత్కరిస్తున్న ఎస్పీ, డిఎస్పి

గ్రామ స్వరాజ్య సాధనకు మళ్లీ జగన్ నాయకత్వం అవసరం

- మాజీ మంత్రి డా,, సాకే శైలజనాథ్

బుక్కరాయసముద్రం ఏప్రిల్ 6 ప్రభాతవార్త

గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేయాలంటే దృఢమైన నాయకత్వం అవసరమని ఆ దిశగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వమే సరైనదని మాజీ మంత్రి డా,, సాకే శైలజనాథ్ పేర్కొన్నారు.సోమవారం బుక్కరాయ సముద్రం మండల కేంద్రంలోని వైకాపా కార్యాలయంలో శింగనమల నియోజక వర్గం పంచాయితీరాజ్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పదవి విరమణ చేసిన వైఎస్సార్సీపీ సర్పంచ్‌లకు ఘన సన్మానం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థులుగా మాజీ మంత్రి సమన్వయకర్త డా,, సాకేశైలజనాథ్ సర్పంచులకు శాలవాలు,పుష్పగుచ్చాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు.గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించారని ప్రజలకు నిస్వార్థంగా సేవలందించి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు.అనంతరం డాక్టర్ సాకే శైలజనాథ్ మాట్లాడుతూ గతంలో వైఎస్ఆర్సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో గాంధీ గ్రామ స్వరా జ్యం లక్ష్యంతో పాలన కొనసాగిందని గుర్తుచేశారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇబ్బందులు పెరిగాయని విమర్శించారు.గ్రామ స్వరా జ్యాన్ని తిరిగి సాదించాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి గా రావాలని అందుకోసం ప్రతి ఒక్క రూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్సీపీ రాష్ట్ర పంచాయితీరాజ్ విభాగం అధ్యక్షుడు వెన్నపూస రవీంద్ర రెడ్డి కూడ సమావేశంలో పాల్గొని సర్పంచుల సేవలను కొనియాడారు.గ్రామ స్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో వారు చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ సాకే శైలజనాథ్

సన్మానంచేసిన సరనంచులతో శైలజనాథ్

సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

అనంతపురం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం జిల్లాలోని యాడికి మండలం వేములపాడు హెలిపాడ్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనకు వచ్చిన సందర్భంగా సోమవారం హెలీప్యాడ్ వద్దకి పలికిన డీఐజీ షిమోషి బాజ్పేయి, అడిషనల్ పిసిసిఎఫ్ శాంతిప్రియ పాండే, సెల్వం కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ తిరుపతి, కమిషనర్ ఆర్ అండ్ ఆర్ ప్రశాంతి, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ పి.జగదీష్, తాడిపత్రి అడిషనల్ ఎస్పీ రోహిత్ చౌదరి, ట్రైనీ ఐపీఎస్ అశ్విన్, మణిదీప్‌లు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై ఘనంగా స్వాగతం పలికారు.

జెఎన్‌టియుఏ 15వ స్నాతకోత్సవం దృశ్య మాలిక